ప్రాణం ఖరీదు

బెహరా వెంకట సుబ్బారావు

రాత్రి తొమ్మిదిన్నరైంది. తాలూకా కేంద్రమైన ధర్మవరంలో బయలుదేరింది విజయనగరం పోయే ఆఖరి బస్సు. ఆ గ్రామం వదలి వేగాన్ని పుంజుకొంది. ఆకాశము మేఘావృతమై వుంది. చల్లని గాలి వీస్తోంది. బస్సులో ప్రయాణీకుల సంఖ్య చాలా తక్కువగా వుంది. సీటుకి ఒకరిద్దరు చొప్పున వున్నారు. డ్రైవర్ వెనుక నున్న సీటులో ఒకే ఒక వ్యక్తి కూర్చున్నాడు. ఫుల్ సూట్‌లో వున్నాడు. బ్రీఫ్‌కేస్‌ని పక్కనే పెట్టుకొని కిటికీ లోంచి బయటకు చూస్తున్నాడు ఆ చీకటిలో. కొందరు పాసింజర్లు కునుకుపాట్లు పడ్తున్నారు. కండక్టరు తన నెత్తిమీద వున్న లైటార్పి సీటుకి జారబడి కూర్చున్నాడు నిశ్చింతంగా.

సూటులో వున్న వ్యక్తికి మాత్రం మనసు కుదటలేదు ! అతని వయసు నలభై దగ్గర వుంటుంది. అతని మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు !

లేక లేక పుట్టిన మేనల్లుని బారసాల వేడుక చూడ్డానికి పది రోజుల క్రితం హైదరాబాద్ వెళ్ళింది అతని అర్ధాంగి శైలజ. ఆమె రాక కోసం అతను అనుక్షణం నిరీక్షిస్తూండగా, ఆ రోజు రాత్రి అతని బావమరది హైదరాబాద్ నుంచి ఫోన్‌లో మాట్లాడాడు. తనూ, తన భార్యా, అక్క శైలజా మాటనీ షో చూసి ఆటోలో తిరిగి వస్తున్నారుట. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ఓ లారీ వచ్చి ఆటోని గుద్ది ఏక్సిడెంటు చేసిందిట. తమకు పెద్ద దెబ్బలు తగల్లేదుగానీ అక్కకి తల మీద పెద్ద గాయం అయిందనీ స్పృహలేని స్థితిలో దగ్గరలోనే వున్న ప్రయివేటు నర్సింగ్ హోంలో జాయిన్ చేశామనీ, బాగా రక్తం పోయిందనీ, పరిస్థితి బాగులేదనీ అర్జంటుగా రమ్మని చెప్పాడు.

ఆ వార్త విన్నాక కాళ్ళూ చేతులూ ఆడలేదతనికి. చివాల్న లేచి బస్‌స్టాండ్ చేరుకున్నాడు. అదృష్టవశాత్తూ ఆఖరి బస్సు అందింది. విజయనగరం వెళ్ళి రాత్రి పన్నెండున్నరకి బయలుదేరే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ అందుకొని హైదరాబాద్ చేరుకోవాలి.

బస్ స్పీడ్‌గా పోతున్నా నత్తనడకలా తోస్తోం దతనికి.

పదిమైళ్ళు పరుగెత్తి సడన్‌గా ఆగింది. డ్రైవర్ సీటులోంచి లేచాడు. ఇంజన్ మూత తీశాడు. ఏదో చేశాడు. స్టార్ట్ చేయాలని ప్రయత్నించాడు. స్టార్ట్ కాలేదు. ఇంజన్‌తో రమారమి గంటసేపు హూరా హూరి పోరాడి ఓటమిని అంగీకరించాడు డ్రైవర్. ఆ సూటు వాలా నిముష నిమిషానికి చేతి వాచీ చూసుకొంటున్నాడు

"ఇంజన్ స్టార్ట్ కాదా ?" ఆత్రుతగా అడిగాడు డ్రైవర్ని.

"లేద్సార్ ! విజయనగరం నుంచి మెకానిక్‌ని తెప్పించాలి ! ఇంజన్ పూర్తిగా విప్పాలి !"

తన అశక్తత్వాన్ని, అసహాయతనీ వ్యక్తం చేశాడు డ్రైవర్. చివాల్న లేచి నిలబడ్డాడా వ్యక్తి.

కండక్టరు బండిలోని పాసింజర్ల నుద్దేశించి అన్నాడు.

"ఉదయంగానీ బండి బయలుదేరదు ! తలుపులూ, కిటికీలూ మూసేసి జాగ్రత్తగా పడుకోండి !"

మరోసారి టైము చూసుకొన్నాడా వ్యక్తి, పదిన్నర అయింది.

"ఈ రాత్రి విజయనగరం పోయి కోణార్క్‌లో హైదరాబాద్ వెళ్ళాలి ! ఎలా ?" కండక్టర్ని అడిగాడతను విలవిల్లాడ్తూ చిన్న పిల్లాడిలా.

"క్షమించండ్సార్ ! చూశారుకదా ! డ్రైవరు ఎంతసేపు శ్రమించాడో ! అతని వల్ల కాలేదు !" అన్నాడు కండక్టరు.

నిరాశా నిస్పృహల్తో తన వైపే చూస్తున్న ఆ వ్యక్తిపట్ల జాలికలిగి ఓ సూచన చేశాడు కండక్టరు.

"ముందు ఓ ఫర్లాంగు దూరంలో ఓ గ్రామం వుంది, దీన దయాళు పాలెం ! అక్కడ రోడ్డు మీద రావులు రిక్షా వుంటుంది. విజయనగరం పదిమైళ్లే కదా ! మరో అయిదో పదో ఎక్కువిస్తానంటే వస్తాడు ! అర్జంటు అంటున్నారు కదా అని చెబుతున్నా ! ప్రయత్నం చెయ్యండి !" ఉపాయం చెప్పాడు.

ఒక్క నిముషం కూడా ఆలస్యం చేయలేదా వ్యక్తి. బస్ దిగి ముందుకు నడక సాగించాడు ఆ చీకటిలో. వాతావరణం అనుకూలంగా లేదు. ఏ క్షణాన్నైనా వానపడేలా కన్పిస్తోంది. అయిదు నిమిషాలు నడిచాక చిన్న గ్రామం కన్పించింది. రోడ్డునానుకొని నాలుగైదు పాకలున్నాయ్. లోపల మిణుకు మిణుకు మంటూ దీపాలు వెలుగుతున్నాయ్. దగ్గరగా వెళ్ళి ఆ పాకల్ని పరీక్షగా చూశాడా వ్యక్తి.

రెండు పాకలు వరసగా వున్నాయ్ తర్వాత చిన్న కిళ్ళీబడ్డీ. బడ్డీకి పాకకి మధ్యలో ఓ రిక్షా కన్పించింది. ఒక అసామీ రిక్షాలో కూర్చొని చుట్ట కాలుస్తున్నాడు. రిక్షాని చూశాక అతని ప్రాణం లేచొచ్చింది.

"అర్జంటుగా విజయనగరము వెళ్ళాలి !" అన్నాడు దగ్గరగా వెళ్ళి.

నోటిలో చుట్టని బయటకు తీసి రిక్షా దిగకుండానే నమ్రతగా జవాబిచ్చాడు రిక్షా వాలా, రావులు

"రాలేను బాబూ ! ఒంట్లో సుఖంగా లేదు !"

"నువ్వడిగినంతిస్తా ! అర్జంటుగా వెళ్ళాలి !" అన్నాడు.

రిక్షా డ్రైవరాశ పడలేదు.

"క్షమించండి బాబూ ! ఆరోగ్యం బావులేదు !" అంత దూరం బండి తొక్కలేను !"

వాళ్ళ మాటలు విని పక్కనే పాకలో నిద్రపోతున్న సింహాచలం లేచాడు. అతనితో బాటే లేచింది ఆ టీ కొట్టు యజమానురాలూ మరియూ అతని అర్ధాంగీ అయిన పైడితల్లి. రిక్షా దగ్గరి కెళ్లారిద్దరూ.

"ఎక్కడి కెళ్లాలి బాబూ ?" అడిగాడు సింహాచలం.

"అర్జంటుగా విజయనగరం కెళ్ళి కోణార్క్ అందుకొని హైదరాబాద్ వెళ్ళాలి ! అతను అడిగినంత డబ్బిస్తా !" అన్నాడా వ్యక్తి.

"పెద్దవసరమే పడివుంటాది ! అడిగినంతిస్తానంటున్నాడా బాబు ! నెమ్మదిగా ఎళ్ళి రాకూడదూ !" సిఫారుసు చేశాడు, సింహాచలం.

ఆ వ్యక్తిలో ఆశ చివురించింది. రావులు మాట్లాడ్లేదు. చిన్నగా దగ్గాడు. వెనుకనే నిలబడి వున్న పైడితల్లి భర్తని మందలించింది.

"ఆసుపత్రిల్లో ఆరు వారాలుండి నాలుగు రోజుల క్రితమే గదా వచ్చాడు ! పెళ్లానికి పురుడు రాక ఆడు మతోయి కూకున్నాడు ! ఇపుడాడేటి యిజానగరం ఎళ్ళగలడు ! నీ కేం మతిలేదేటి !"

వాళ్ళని బ్రతిమాలడానికి సమయంగానీ, బేరం చేయడానికి వ్యవధి గానీ లేదా వ్యక్తికి. మరో రెండు గంటల్లోగా స్టేషన్ చేరుకోకపోతే కోణార్క్ అందదు ! అయిదు నిమిషాలు ఆలస్యం అయితే ఒక రోజు అతను నష్టపోతాడు. ఎక్కువ డబ్బు గుంజడానికే వారలా నాటకం ఆడుతున్నారని గ్రహించాడు.

"పాతిక రూపాయిలిస్తా !" అన్నాడు.

ఎవరూ మాట్లాడలేదు. ఆ చీకటిలో ఒకరి మొహం లొకరికి కనబడ్డం లేదు. ఆ దూరానికి అంత డబ్బు ఎక్కువే ! వెళ్లే శక్తి లేక మౌనం వహించాడు రావులు.

"ఏభై యిస్తా ! ఊ ! పద ! నా అవసరం అలాంటిది !" తొందర చేశాడా వ్యక్తి.

"అడికైతే రావాలనే వుందిగానీ వంట్లో సుఖంగాలేదు బాబూ ! అంత దూరం తొక్కలేడు !" ఈడిస్తూ అంది పైడితల్లి.

"వందరూపాయిలిస్తా ! రేపు హైదరాబాద్‌లో వుండాలి. చాలా అవసరం ఇంకా ఆలోచించకు ! ప్లీజ్ !" బ్రతిమాలడం ప్రారంభించాడా వ్యక్తి.

"ఏరా రావులూ ! ఎళ్ళగలవా ? శానా అర్జంటులా వుంది ! లేపోతే అంత డబ్బిస్తానంటారా !" మెత్తబడింది పైడితల్లి. తర్వాత సింహాచలం అందు కొన్నాడు.

"అవున్రా రావులూ ! కాస్తంత కష్టబడితే వందరూపాలొస్తాయ్ ! ఫలితం దక్కుతుంది ! ముచ్చేల్ని రేపు ఆసుపత్రిక్కి తీసుకెళ్లొచ్చు ! నెమ్మదిగా లాక్కెళ్ళి తెల్లారే సరికి తిరిగి రా ! ఆ బాబు అవుసరం కూడా తీరుద్ది !"

బండి దిగాడు రావులు. వాడిక్కావల్సింది డబ్బు ! ఆరోగ్యం కాదు ! ఆ డబ్బుతో ముత్యాల్ని బతికించుకోవాలి !

"ఆడికి సెత్తిలేపోయినా తవరి కోసం వత్తున్నాడు ! ఎంతిస్తావన్నారు! బాబూ?" కంగించింది. పైడితల్లి.

"వందిస్తానన్నా" అన్నాడా వ్యక్తి తొణక్కుండా.

"నిజవేఁనా బాబూ !" నమ్మశక్యంగాక అనుమానంగా అడిగింది పైడితల్లి.

"ఏం ? అనుమానమా ?" చీకాకు పడ్డాడా వ్యక్తి.

"తవరు పెద్దింటోరు ! డబ్బు మడుసులు !" అని తడబడి మాట సర్దుకొంది పైడితల్లి.

"అదే ! డబ్బున్న మా రాజులు ! తీరా అక్కడి కెళ్ళాక ఆడి సేతిలో పాతికో పరకో పెట్టి 'పోరా పో !' అంటే ఆడేటి సెయ్యగల్డు సెప్పండి ! అక్కడందరూ తవరి మాటే పలుకుతారు !" మనసులోని మాటల్ని బయట పెట్టింది పైడితల్లి.

"నువ్వన్నట్టు డబ్బు మనిషినే అయినా మాట తప్పేది లేదు ! మాటకున్న విలువ డబ్బుకి లేదు ! నిస్సహాయ స్థితిలో వున్న వానికి చేసిన సహాయానికి డబ్బుతో విలువ కట్టలేం ! ఇప్పుడు నా అవసరం అలాంటిది ! మీ సహాయం కావాలి ! ఆ సహాయనికి ప్రతిఫలంగా వందరూపాయలిస్తానన్నా ! అతను పడిన కష్టానికి కాదు !" అతని మాటలకి అంతా ఆశ్చర్యపోయారు. పశ్చాత్తాపం చెందింది పైడి తల్లి.

"మరోలా అనుకోకండి బాబూ ! పాసింజర్లతో అనేక రకాల తగూలొత్తూ వుంటాయ్ ! డబ్బు సమయం గదా అని మరోసారడిగా ! అయినా తవర్ని సూత్తేనే తెలుస్తోంది మాట తప్పే మడిసి కాదని !" సన్నాయి నొక్కులు నొక్కింది.

"ఎళ్ళు రావులూ ! తొందరగా తీసుకెళ్ళి ఆ బాబుకి కోణార్క్ అందించేయ్ !" తొందర చేశాడు సింహాచలం.

రిక్షా బయలుదేరి చీకటిలో కల్సిపోయింది. రిక్షా చప్పుడు తప్పించి మరో శబ్దం లేదు ! రిక్షాలోని పాసింజరూ డ్రైవరూ ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

"శైలజను ఏ పరిస్థితిలో చూడాల్సి వస్తుందో ! వెళ్ళిన వెంటనే ఆమెను ఉస్మానియా హాస్పటల్‌కి తరలించాలి ! అక్కడ తన గురువుగారు ఉన్నారు ! ఆమెకు ఎలాంటి దెబ్బలు తగిలాయో ఎక్కడెక్కడ తగిలాయో వివరంగా తెల్సుకోలేక పోయాడు ! అంతా ఆతృత ! కంగారు ! భయం ! బావ మరిది వెంటనే బయలుదేరి రమ్మన్నాడు ! తాను వస్తున్నానన్నాడు ! వివరంగా తెల్సు కోనందుకు పిచారించాడు ! ఆమెకు బ్లీడింగ్ కంట్రోలైందో లేదో ! పరిస్థితి ఎలా వుందో ! శైలజ తనకు దక్కుతుందా ? మనసు పరి పరి విధాల పోతోంది. కీడుని శంకిస్తోంది."

దుఃఖాక్రాంతుడయ్యాడా వ్యక్తి.

ఇక రావులు పరిస్థితి !

భార్య ముత్యాలు తప్పించి రావులికి నా అన్న వారెవరూ లేరు. వయసు ముప్పై వుంటుంది. చదువుకోలేదు. ధర్మవరంలో ఓ షావుకారి దగ్గర రిక్షా అద్దికి తీసుకొని దీనదయాళుపాలెంకి ధర్మవరంకి మధ్య తిరుగుతూ

వుంటాడు. అప్పుడప్పుడు విజయనగరం కూడా వెళ్తూవుంటాడు. రావులికి సంతానం లేదు. భార్యకి మూడు సార్లు గర్భంపోయింది. నాలుగోసారి గర్భవతి అయింది. నెల తప్పిన దగ్గరనుంచీ రెండు వారాల కోసారి ముత్యాల్ని ధర్మవరం తీసుకెళ్ళి డాక్టరు ధర్మరాజు గారికి చూపిస్తూ వస్తున్నాడు. ఈ సారి గర్భస్రావం జరగకుండా చూసే పూచీ నాదని మొదటనుంచీ హామీయిస్తూ ఆ దంపతులకి ధైర్యం చెప్తూనే వున్నారు డాక్టరుగారు అయన చేతి చలువ వల్లనే యే యిబ్బందీ లేకుండా ముత్యాలుకి తొమ్మిది నెలలూ నిండాయ్.

డా॥ ధర్మరాజుగారంటే అక్షరాలా ధర్మరాజుగారే. ఆ గ్రామంలో ప్రభుత్వ హాస్పిటలున్నా ఎక్కువగా ముఖ్యంగా బీదా బిక్కీ ప్రయివేటు హాస్పిటలా అయిన డాక్టరు ధర్మరాజుగారి దగ్గరకే పోతారు. ఆయనంటే ఆ తాలూకాలోని ప్రజలందరికీ పెద్ద గురి ! ఆయన హస్తవాసి మంచిదని అందరికీ నమ్మకం. ధర్మరాజుగారు పేషంట్లు ఎంతిస్తే అంత తీసుకొంటారు. ఇచ్చిన సొమ్ముని లెక్కపెట్టకుండానే జేబులో పెట్టుకొంటారు. ఎవరైనా యివ్వలేకపోతే ఏమీ అడగరు. ఇతర డాక్టర్లలా కేసుకి యింత అని ఖరాఖండి చేయరు. బీద ప్రజల దృష్టిలో ఆయన దేముడు !

ఆరు వారాల క్రితం పచ్చకామెర్ల రోగం వచ్చింది రావులికి. మొదట్లో తెలుసుకోలేక పోయాడు. తెల్సుకొన్నాక కొన్నాళ్ళు నిర్లక్ష్యం చేశాడు. ఆ పసర ఈ పసర వేసుకొన్నాడు. వ్యాధి ముదిరింది. మంచం పట్టాడు. టీ కొట్టు యజమానురాలు పైడితల్లి పట్టు పట్టి బలవంతాన ధర్మరాజుగారి హాస్పిటల్లో చేర్పించింది. వ్యాధి నయం అయింది. నాలుగు రోజుల క్రితమే యింటికొచ్చాడు. నెలలు నిండిన ముత్యాలుకి రెండు రోజుల క్రితం పురిటి నెప్పులు ఆరంభించాయ్. ఆ గ్రామంలో అందరికీ పురుళ్ళు పోసే నాటు మంత్రసాని రాములమ్మని పిలిచాడు రావులు. ఒకరోజల్లా రాములమ్మ పాటుపడింది. ముత్యాలుకి పురుడు రాలేదు. అధైర్య పడింది రాములమ్మ కూడా.

"ముప్పై యేళ్ళ నుంచీ పురుళ్ళు పోస్తున్నా ఇలాంటి కేసు తగల్లేదు ! అసుపత్రికి తీసుకెళ్తే మంచిది ! ఆపరేషన్ చేయాల్సి వస్తుందేమో !" అంది పక్క గుడిసెలో వుంటున్న విమలమ్మని తోడు తీసుకొని భార్యని రిక్షా మీద ధర్మరాజుగారి హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడు రావులు. అతనిదురదృష్టం! ధర్మరాజుగారు వూళ్ళో లేరు ! హైదరాబాద్ వెళ్ళారనీ వారం రోజుల వరకూ తిరిగి రారని తెల్సింది. రావులికి నవనాడులూ కృంగిపోయాయ్.

"గవర్నమెంటాసుపత్రికి తీసుకెళ్దాం !" తొందర చేసింది విమలమ్మ. రిక్షా కదిలింది.

ప్రభుత్వ ధర్మాసుపత్రి డాక్టరుగారు ముత్యాలుని తణిఖీ చేశారు. ఆపరేషన్ చేయాలన్నారు. కాంపౌండరు. విమలమ్మని పక్కకి పిల్చి మాట్లాడాడు.

విమలమ్మ చెప్పిన మాటలు విన్న రాములు అయోమయ స్థితిలో పడ్డాడు. నోట మాటరాలేదు. ఆలోచనలో పడ్డాడు.

"మరేవీ ! ఆలోసించక రావులూ ! ముచ్చేలు బతకడం మనకి ముక్కెం ! రెండొందలు కోసం ఆలోసించక !"

"రెణ్ణెళ్ళ నుంచీ బండేయ లేదు ! నా జబ్బు కోసవే దొరికిన చోటల్లా అప్పులు సేశా !" నీరుగారి పోయాడు రావులు.

"దాని శతమానాలమ్మేసేనా దాన్ని రచ్చించు కోవాల !" వుపాయం చెప్పింది విమలమ్మ.

"ముచ్చేలు శతమానాలు ఎప్పుడో అమ్మేసా ! దాని మెడలో వున్నవి. సంతలో కొన్న శతమానాలు ! దాని పేణం రక్షించుకోడానికి నా దగ్గర రెండొందలు లేవు ! నా అదృష్టం ఎలావుంటే అలా జరుగుద్ది ! మన రావులమ్మే నాకు దిక్కు ! దాని చేతుల్లోనే ముచ్చేల్ని పెడతాను ! భగవంతుని దయ !" తన నిర్ణయాన్ని తెలియజేశాడు, రావులు.

"రావులమ్మా ! ముచ్చేలు నా పేణం ! దాన్ని నీ చేతుల్లో పెడ్తున్నా రెండొందలు పెట్టి దాని పేణం కొనుక్కోలేను !" రావులమ్మ కాళ్ళ మీద పడి వల వల యేడ్చాడు రావులు.

ముత్యాలు బాధ పడ్తూంటే వినలేక రోడ్డు మీద కొచ్చాడు రావులు. రిక్షాలో కూర్చుని జాగరం చేస్తున్నాడు. ఏ క్షణం ఎలాంటి వార్త వినాల్సి వస్తుందో నన్న భయం ! ముచ్చేలుకి ఆపరేషన్ చేయించాలంటే రెండొందలు కావాలి ! ఎలా ఎలా సంపాదించడం ? ఇదే ఆలోచనతో రిక్షాలో కూర్చొని జాగరం చేస్తున్నాడు. అనుకోకుండా పెద్ద బేరం తగిలింది. శక్తి లేకపోయినా తొక్కుకున్నాడు.

రావులికి మరో ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన అతన్ని భయభ్రాంతున్ని చేసింది. నరాల పట్టు సడలింది. రిక్షా వేగం తగ్గింది.

కొంతమంది ఏ దొంగతనమో, హత్యో చేసి యిలా రిక్షా డ్రైవర్లకి, టాక్సీ డ్రైవర్లకి బోలెడు డబ్బు ఆశపెట్టి తప్పించుకు పారిపోతారు ! ఒక్కొక్కప్పుడు సాక్ష్యం దొరక్కుండా వుండేందుకు డ్రైవర్ని కూడా ఏ కత్తితోనో పొడిచి పారిపోతారు. ఈ పాసింజరు అలాంటివాడు కాదు కదా ! అలా అయితే తాను ప్రాణాన్నైనా పోగొట్టుకోవాల్సి వస్తుంది. లేదా ! పోలీస్టేషన్లో పడి వుండాల్సి వస్తుంది. అలా జరిగితే తన గతేంగాను ! ముచ్చేల్ని ఎవరు చూస్తారు! అది చావు బతుకుల మధ్య వుంది.. భయంతో వణికిపోతున్న రావులుకి కాళ్ళాడలేదు. నెమ్మదిగా పోతోంది రిక్షా.

ఇంతలో టప టప చినుకుల్తో ప్రారంభించి వాన పెద్దదైంది. రిక్షా ఆపాడు రావులు. పాసింజరు చేతి వాచీ చూసుకొన్నాడు "పావు తక్కువ పన్నెండు ! నంబైౖ అయిదు నిమిషాలే టైముంది. ఇంక రెండు మైళ్ళు మాత్రమే పోవాలి ! వానకి జడిసి ఆగిపోతే ఎలా ?" ఆందోళన చెందాడు పాసింజరు. సీటు కింద వున్న పెద్ద పోలితిన్ పేపర్ని బయటకు తీసి కోటులా తగిలించుకొన్నాడు రావులు.

తిరిగి రిక్షా కదిలింది. వాన పడుతూనే వుంది. రిక్షా వేగంగా పోవడం లేదు.

"వేగంగా పోనీయ్ ! కోణార్క్ అందకపోతే మనం పడ్డ శ్రమంతా వృధా అవుతుంది ! ఉదయం టిఫిన్ చేయడానికి మరో అయిదు రూపాయలిస్తా !" తొందర చేశాడా వ్యక్తి.

'అర్జంటుగా కోణార్క్కెక్కి ఏ హైదరాబాదో, బొంబాయో పారిపోదావనుకొంటున్నాడు ! ఇతగాడే పనిసేశాడో ! ఈ కేసులో అనవసరంగా సిక్కుకొన్నా !'

రావులి అనుమానం బలపడింది ! భయం చిక్కబడింది.

"అంతరిజెంటుగా ఎళ్ళాలేటి బాబూ !" అడిగాడు ధైర్యంచేసి. అవసరం ఏవిటో. వివరంగా చెబుతాడని ఆశించాడు.

తాను తొందరపడ్డానికి గల కారణం, తాను అర్జంటుగా ఎందుకు వెళ్ళాల్సి వస్తోందీ అంతా వివరంగా చెబితే తొందరగా పోనిస్తాడనుకొన్నాడా పాసింజరు.

ఆ రోజు సాయంత్రం హైదరాబాద్‌లో నున్న తన భార్యకు ఏక్సిడెంట్ అయిందనీ, హిస్పిటల్లో చావు బతుకుల మధ్య వుందనీ, అందుకే తానర్జంటుగా వెళ్తున్నాననీ చెప్పాడా వ్యక్తి.

అతని పరిస్థితికి జాలి పడ్డాడు రావులు.

"తొందరగా ఎల్లి పెద్ద డాక్టరు చేత వైద్యం చేయించండి బాబూ ! తవర్కి కోణార్క్ అందించే పూచీ నాది !" అంటూ రిక్షా స్పీడు హెచ్చించాడు రావులు. వారి అదృష్టం కొద్దీ వాన జోరు తగ్గి తగ్గి పూర్తిగా ఆగింది.

రిక్షా స్టేషన్ చేరే సరికి పన్నెండు దాటింది. గేటులో రిక్షాని ఆపాడు రావులు. ఆ బాబు రిక్షా దిగాడు. లైట్ల వెలుగులో ఆ వ్యక్తి మొహం చూశాడు రావులు. ఆయన డాక్టరు బాబు ! గవర్నమెంటు ధర్మాసుపత్రి డాక్టరు ! ఉదయం తన ముత్యాల్ని చూసిన డాక్టరు ! రావులులో అంతవరకూ వున్న జాలి, సానుభూతి మాయవయ్యాయ్ ! తన భార్య ప్రాణాన్ని కాపాడ్డానికి రెండు వందలు అడిగిన అతన్ని కసిగా చూశాడు! అసహ్యం, ద్వేషం, పగ అతని మొహంలో చోటు చేసుకొన్నాయ్. తన పెళ్ళాం ప్రాణం ఖరీదు రెండు వందలు ! అతని భార్య ప్రాణం విలువ వేలు ! లక్షలూ ! ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా వున్నాడు.

అతనందిస్తూన్న వంద రూపాయల నోటుని అందుకోలేదు రావులు ! ఆ నోటు వైపు చూస్తూ వుండిపోయాడు. మరు క్షణంలో దుఃఖం ముంచుకొచ్చింది.

"నా ముచ్చేలు కింకా పురుడు రాలేదు బాబూ ! సావు బతుకుల మద్దెనుంది !" అంటూ భోరున ఏడ్చాడు. కాళ్ళ మీద పడ్డాడు. రావుల్ని పరీక్షగా చూశారు డాక్టరుగారు. జ్ఞాపకం వచ్చింది. ఉదయం భార్యని డెలివరీ కోసం

నాకు అనిపిస్తుంది

రోజులో సగం సమయం బస్టాపులో ముగిసినప్పుడు
పలకాబలపంకన్న జాగ్రత్తగా విద్యార్థులు కంచాలు
తెచ్చినప్పుడు
కథలు చెప్పినప్పుడు లేని ఆనందం —
పిడికెడు మెతుకులు చూడగా వారు పొందడం
గమనించినప్పుడు
బాలుర నోళ్లు కొట్టి నడి హస్తాలు దోచి కుంటిసాకులు
చెప్పినప్పుడు
ఖాళీ ప్లేట్ల ముందు పిల్లల నైరాశ్యం అర్థమయినప్పుడు
ఆఫీసులో ఎల్. డి. సి. ల ముందు నా ప్రవర్తనను
సమీక్షించు కొన్నప్పుడు
వారి అవినీతిని అంచనా వేయలేక పోయినప్పుడు
ఇంట్లో కోరికల లిస్టు విన్నప్పుడు
మార్కెట్టు ధరలు పాకెట్‌తో ఈక్వల్ కానప్పుడు
పత్రికల్లో కవితలు చదివినప్పుడు
పరిష్కారాన్వేషణలో తల వేడెక్కినప్పుడు
దానిని కలంతూడా వ్యక్తం చేయలేక పోయినప్పుడు
నాకు అనిపిస్తుంది
ఈ బుర్రలో ఆలోచనలే లేకుంటే !
ఈ కళ్లకు నిజానిజాలు తెలుసుకొనే శక్తి లేకుంటే !
ఎంత బాగుండేదో ! ! అని

నేను-నీవు

నీ చూపు లటువైపు
నా చూపు లిటువైపు
యుగ యుగాల మనుగడలో
ఏకమైన దాఖలాలు లేవు చరిత్రలో
ఐక్యతా నినాదాలకు కొదువ లేదు ధరిత్రిలో
అటు చూడు వారు —
నిత్య ప్రజా సేవా తత్పరులు
దేశనాయక వేషభూషణులు
శాంతి మారణాయుధా ధరులు
సమతామత వాక్పా రాయణులు
బొమ్మా - బొరుసుల్లా మనలను
సమాజ నాణ్యంలో చిత్రించి
చలామణి చేసేసూ
బ్రతుకు తున్నారు — బ్రతికి పోతున్నారు
ఉత్తర దక్షిణ ధృవాల్లా మనలను
భూగోళంలో విడగొట్టి
పరిశోధనా గ్రంథాలు వ్రాసేస్తూ
శాస్త్రజ్ఞులౌ తున్నారు — బిరుదులందు తున్నారు
సమాంతర రేఖల్లా మనలను
పదిలంగా ఉంచి
ఎన్నికల వ్యాపారాలు చేస్తూ
పురోగమన గీతాలు పాడు తున్నారు — నిద్ర
పుచ్చుతున్నారు.
కలిమిలేములైన మనలను
పదవీ సోపానాలుగా పేర్చి
ఎక్కిపోతున్నారు
అధికార మదాంధులౌ తున్నారు
వాక్శ్రీయులైన మనలకు
వాగ్దానాల మంత్రాలు వినిపిస్తూ
సౌందర్యారాధకులైన మనలకు
ప్రణాళికల వర్ణచిత్రాలు చూపిస్తూ
హిప్నొటైజ్ చేస్తున్నారు
ఇదే బాగుందను కొంటే
"ఎక్కడున్నావ్ గొంగళీ" అన్నట్టు
నీ వక్కడే నేనిక్కడే ఉందాం
వద్దను కుంటే
చేయి చేయి కలుపుదాం
నడుంకట్టి కదుల్దాం !

శ్రీ సడ్లపల్లె చిదంబరరెడ్డి

హాస్పిటల్కి రిక్షాలో తీసుకొచ్చాడు. అలవాటు ప్రకారం కాంపౌండర్ని మాట్లాడమన్నాడు తను. ఇప్పుడిద్దరూ ఒకే స్థితిలో వున్నారు.

"హాస్పిటల్లో ఏడ్మిట్ చేయకుండా ఎందుకు తీసుకు పోయావ్ ?" ప్రశ్నించారు.

ఆయన ప్రశ్నకి అవాక్కయ్యాడు రావులు. పెద్ద వారు సమయానుకూలంగా మాట్లాడరని అంతవరకూ అనుకొనే వాడు. చివాల్న లేచి ఆయన మొహంలోకి చూశాడు.

"నీ భార్యకి ప్రాణభయం లేదు ! ఆపరేషన్ అవసరం అవుతుందేమోనన్న అనుమానం కొద్దీ అలా అన్నాను ! కొంచెం కష్టంగా డెలివరీ అవుతుంది ! భయపడకు !"

తన్ను ఓదార్చడానికే ఆయనలా అంటున్నారని గ్రహించాడు రావులు.

"డబ్బుతీసుకో !" నూరు రూపాయల నోటు అందించబోయాడు.

రావులు చేయి చాచలేదు !

"పాతిక రూపాయలిప్పించండి చాలు !" అన్నాడు దృఢంగా.

"వంద రూపాయలు నే నివ్వనేమోనని ఆమె ఎవరో శంకించింది కూడా ! తీసుకో ! అవసరానికి పనికొస్తుంది."

"వద్దు బాబూ ! నేను పడ్డ కష్టానికి పాతిక చెల్లిస్తే సరిపోద్ది ! పాసింజర్ల అవసరాన్నీ, ఆపదని ఆసరాగా తీసుకొని ఎక్కువ డబ్బు గుంజితే యిలాంటి ఆపదలే వస్తాయ్ ! నా ముచ్చేలు ప్రాణం ఆ భగమంతుని చేతుల్లో వుంది. ఆయనే కాపాడతడు !"

రావులి మాటలు చెరణాకోల దెబ్బల్లా తగిలాయ్ ఆ డాక్టరు బాబుకి.

'తానెంత డాక్టరైనా భార్య ప్రాణాన్ని కాపాడలేడు ! రావులన్నట్టు అంతా భగవంతుని చేతుల్లోనే వుంది ! ప్రాణాన్ని డబ్బుతో కొనలేం ! అది అమూల్యం !' అనుకొన్నాడు.

అవతల ట్రైన్ టైమవుతోంది. అతను కోరిన పాతిక రూపాయలు తీసి అందించాడు. డబ్బు తీసుకొని కళ్ళ కద్దుకొని డాక్టరుగారికి నమస్కరించాడు. రావులు రిక్షా లాక్కొని దూరంగా పోయాడు.

తెల తెలవారుతుండగా తిరిగి గ్రామం చేరుకొన్నాడు. టీ కొట్టు పైడితల్లి ఎదురుగా వచ్చింది. ఆమె మొహం ఆనందంతో నిండిపోయింది.

"నీ కోసమే ఎదురుసూత్తున్నా ! పనసపండు లాంటి కొడుకు పుట్టాడు ! ముచ్చేలు సుఖంగా వుంది ! రా ! [illegible] సిందువుగాని !"

చల్లని కబురు చెబుతూ ఆహ్వానించింది పైడితల్లి. □